క్లుప్తంగా

బోర్డు మార్చండి సారూ...



జూనియర్ కళాశాలలో పాత పేర్లతో సమాచార హక్కు చట్టం బోర్డు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని రాజాకుమారస్వామి రాజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమాచార హక్కు చట్టం బోర్డును మార్చడం లేదు. గతంలో కొన్ని సంవత్సరాల క్రితం పదవీ విరమణ చేసి అధ్యాపకురాలు పి.ఉమాసుందరి, సంవత్సరం క్రితం బదిలీపై వెళ్లిన ప్రిన్సిపల్ కె.బాలసుబ్రమణ్యంరాజు, జూన్‌లో పదవీ విరమణ పొందిన బంగారయ్య పేర్లు ఈ బోర్డులో నేటికీ దర్శనమిస్తున్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు సమాచార హక్కు బోర్డులో పాత అధికారుల పేర్లే ఉండడంతో అవాక్కవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమాచార హక్కు బోర్డులోని పేర్లు మార్చాలని పలువురు కోరుతున్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో మూడో విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ భైరవుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా 28న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తెచ్చి వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. 29న ఐటీఐలో జరిగే ఇంటర్వ్యూకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 95337 23022 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మత మార్పిడులు అరికట్టాలి



రక్షలను పంపిణీ చేస్తున్న క్రిష్ణమూర్తి

కార్వేటినగరం: గ్రామాల్లో జరుగుతున్న మత మార్పిడులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని హిందూ ధర్మప్రచార పరిషత్ చైర్మన్ ఎంజీ కృష్ణమూర్తి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామి ఆలయంలో సమరతసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ధర్మరక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతమార్పిడులను నివారించేందుకు గ్రామాల్లో హిందూ ధార్మిక కార్యక్రమాలు చేయాల్సి ఉందన్నారు. ఇతర మతాలకు మారిన వారిని గుర్తించి తిరిగి హిందూ మతంలో చేర్పించేలా చూడాలన్నారు. అనంతరం రక్షలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, యువరాజు, నరసింహులు, ఆనంద్ పాల్గొన్నారు.

విజయపురం తహసీల్దార్‌గా కిరణ్



విజయపురం: మండల తహసీల్దార్‌గా కిరణ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరలో ఇతను చిత్తూరు డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. బదిలీపై విజయపురం బాధ్యతలు తీసుకొన్నారు. రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన ఆయన స్థానిక అంశాలపై చర్చించారు. ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

వైభవంగా బకాసుర కుంభం



బకాసుర కుంభం కార్యక్రమంలో గ్రామస్తులు

నగరి: చింతలపట్టెడలో వైభవంగా నిర్వహిస్తున్న ద్రౌపది తిరనాళ్లలో భాగంగా సోమవారం బకాసుర కుంభం కార్యక్రమాన్ని నిర్వహించారు. బకాసురునికి బండిపై కుంభం తీసుకెళ్లే మహాభారత ఘట్టాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఈ ఉత్సవాన్ని వీక్షించారు. నిర్వాహకుడు డాక్టర్ ఎంపీ నటరాజన్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించగా స్థానిక భక్తుడు సత్యనారాయణన్ ఈ కార్యక్రమానికి ఉభయదాతగా వ్యవహరించారు. రాత్రి ఆలయం వద్ద మహాభారత పారాయణం కార్యక్రమం నిర్వహించారు.

కాపాడుకుంటే సిరులే!

ప్రస్తుతం పాడి పరిశ్రమ సిరులు కురిపిస్తోంది. రైతులకు అదనపు ఆదాయం తీసుకొస్తోంది. పుట్టిన లేగ దూడ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే రేపటి పాడి పశువుగా మారి లాభాలు పొందవచ్చు. ఈ దూడలకు సంక్రమించే వ్యాధులను ఎప్పటికప్పుడు గమనించి తగిన సంరక్షణ చర్యలు పాటించడం ఉత్తమం. శుభ్రమైన వాతావరణంలో దూడలను పెంచడంతోపాటు నాణ్యమైన దాణా అందించడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చు. లేగ దూడల్లో సీజనల్‌గా వచ్చే బొడ్డువాపు వ్యాధికి నిర్ణీతమైన సమయంలో చికిత్స అవసరం. తద్వారా దూడల మరణశాతాన్ని తగ్గించ వచ్చు. పశువులకు దూడ జన్మించిన వెంటనే వైద్యుల సూచనలు, సలహాల మేరకు కనీస జాగ్రత్తలు తీసుకుంటే బొడ్డు వాపు వ్యాధి నిర్మూలన కష్టతరం కాదు.

- పాడిలో లేగదూడల సంరక్షణే ముఖ్యం
- బొడ్డువాపు వ్యాధి అత్యంత ప్రమాదం
- జాగ్రత్తలు తీసుకుంటే నిర్మూలన సాధ్యం



కొల్లాగుంటలో మేలు జాతి దూడలు

కార్వేటినగరం: లేగ దూడల్లో అన్నింటి కంటే బొడ్డు వాపు వ్యాధి అత్యంత ప్రమాదకరమైంది. అపరిశుభ్రమైన వాతావరణంలో పుట్టినా, ముర్రుపాలు తగిన రీతిలో సకాలంలో తాగించక పోయినా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. దీనిని సకాలంలో అరికట్టకపోతే దూడకు ప్రాణాంతకం. సాధారణంగా దూడ పుట్టిన నాలుగు రోజుల నుంచి నెల రోజుల్లోపు తీవ్ర జ్వరం వస్తే దానిని బొడ్డువాపు లేదా బొడ్డువాపు జ్వరంగా గుర్తించాలి. పాడి రైతు సత్వరమే పశు వైద్యాధికారిని సంప్రదించి లేగ దూడ పరిస్థితిని వివరించాలి. దూడ పుట్టిన సమయంలో బొడ్డు నరాన్ని సరిగ్గా కట్ చేయక పోవడంతో ఎక్కువగా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ఎందుకంటే బొడ్డు నరం ద్వారా శరీరంలోకి సూక్ష్మజీవులు ప్రవేశించి బొడ్డు వాపును కలిగించి తద్వారా వ్యాధి వచ్చే అవకాశం ఉందని పశు వైద్యులు చెబుతున్నారు. ఒక్కోసారి బొడ్డును కోసేందుకు వినియోగించే బ్లేడు తుప్పు పట్టినా, స్టెరిలైజ్ చేయకపోయినా ఈ వ్యాధి సోకుతుంది. పశువుల కొట్టంలో దగ్గర దగ్గరగా కట్టిన దూడలు చప్పరించడంతో గాని, నేలను తాకి మట్టిని తినడంతో ఈ వ్యాధి సోకే ప్రమాదముంది.

వ్యాధి లక్షణాలు

- ఈ వ్యాధి సోకిన లేగ దూడకు తొలుత బొడ్డు వద్ద వాపు వస్తుంది.అది క్రమేపీ పెద్దదవుతూ దుర్వాసనతో కూడిన చీము కారుతుంది
- దూడకు జ్వరం వచ్చి తగ్గకపోవడంతో నీరసించి పోతుంది. తల్లిపాలు తాగలేదు
- ముక్కు నుంచి నీరు కారిపోతూ శ్వాస తీసుకునేందుకు కష్టపడుతుంది
- మలవిసర్జన సక్రమంగా జరగక మల బద్ధకంతో బాధపడుతుంది

నివారణ చర్యలు

- పశువులు ఉండే ప్రదేశాన్ని తొలుత పరిశుభ్రం చేయాలి. ఆ పాక చుట్టూ సూక్ష్మజీవులు దరి చేరకుండా వ్యాధికారక నివారణ మందును పిచికారీ చేయించాలి
- బొడ్డు వ్యాధి సోకిన దూడను సత్వరమే మంద నుంచి వేరుచేసి తగ్గిన తరువాత మాత్రమే మళ్లీ కలపాలి
- బొడ్డు నరాన్ని రెండు అంగుళాలు వదలి కత్తిరించేటప్పుడు కొత్త పరికరాన్ని మాత్రమే వినియోగించాలి. కత్తిరించిన తరువాత మూడు రోజుల వరకూ టింక్చర్‌ను అద్దుతూ ఉండాలి. కాకులు, కోళ్లు ముక్కుతో పొడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- లేగ దూడ పుట్టిన వెంటనే మూతికి బుట్టలు కాని, చిక్కాలు కాని అమర్చాలి

చికిత్సా విధానం



బొడ్డు వ్యాధి నివారణకు సుమారు పది రోజులు పడుతుంది. వాపు గట్టిగా ఉన్నట్లయితే మెత్తబడే వరకూ అయోడిన్ ద్రావణంతో మర్దన చేయాలి. పలుచని వస్త్రంలో ఉప్పుకట్టి వేడి నీటితో కాపడం పెట్టాలి. వాపు బాగా మెత్తబడిన తరువాత గడ్డ మధ్యలో రంధ్రం చేసి చీమును పూర్తిగా పిండేయాలి. అనంతరం పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో లోపలి వరకూ మూడు సార్లు కడిగి దూదితో పొడిగా తుడవాలి. టింక్చర్‌తో ముంచిన బాండేజ్ క్లాత్‌ను రంధ్రంలోకి సరిపడా ఎక్కించాలి. రోజు విడిచి రోజు టింక్చర్ క్లాత్‌ను మార్చాలి. ఇన్‌ఫెక్షన్ తగ్గే వరకూ యాంటి బయాటిక్ మందులను దూడకు అందజేయాలి. లేగ దూడలు బలహీనంగా ఉంటే గ్లూకోజ్, బీ కాంప్లెక్స్ ఇంజెక్షన్లు ఇవ్వాలి.

– డాక్టర్ ప్రభాకర్ జిల్లా పశు సంవర్ధక శాఖ సంచాలకులు, చిత్తూరు

పంట పొలాల్లో జీవామృతం తొట్టెలు



మేళపట్టు గ్రామంలో పొలంలో నిర్మించిన జీవామృతం తొట్టె

నగరి: ఘనజీవామృతాన్ని పిడకల రూపంలో తయారుచేసి నిల్వ ఉంచుకునే రైతులు ద్రవ జీవామృతాన్ని ప్లాస్టిక్ తొట్టెలు, క్యాన్లలో నిల్వ చేస్తారు. అయితే ఈ ప్లాస్టిక్ క్యాన్లు చోరీలకు గురికావడంతో శాశ్వత ప్రాతిపదికన జీవామృతం తొట్టెలను నిర్మించుకుంటున్నారు. సోమవారం మేళపట్టు గ్రామంలో రైతు చిట్టిబాబు తన పొలంలో జీవామృతం తొట్టెను నిర్మించుకున్నారు. పొలానికి నీరు పారించే కాలువల పక్కనే సిమెంటు ఒరలతో 500 లీటర్ల సామర్థ్యం ఉన్న తొట్టెలను పక్కాగా నిర్మించుకుంటున్నారు. ఈ తొట్టెలకు అడుగున కొళాయి ఏర్పాటుచేసి నీరు పారే కాలువల్లో వదిలేస్తున్నారు. ఇలా చేయడంతో నీటితో కలిసి ద్రవ జీవామృతం పొలానికి సమంగా పారుతూ సత్ఫలితాలనిస్తోంది. నగరి డివిజన్ పరిధిలోని మండలాల్లోనే వందకు పైగా రైతులు తమ పొలాల్లో శాశ్వత ద్రవజీవామృత తొట్టెలను నిర్మించుకున్నట్లు ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్ తెలిపారు.

వైఎస్‌ఆర్ కేడర్‌ను దెబ్బతీయడానికే అక్రమ కేసులు

కార్వేటినగరం: జీడీ నెల్లూరు నియోజకవర్గంలో వైఎస్‌ఆర్ సీపీ కార్యకర్తలు, ఓటర్లలో ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీయడం కోసం టీడీపీ ప్రభుత్వం కేసులు పెడుతోంది. తాజాగా కార్వేటినగరంలో ఒక నాయకుడిపై ఎర్రచందనం కేసు పెట్టడం తెలిసిందే. నియోజకవర్గంలో బలమైన నాయకుడిగా ఉన్న గురువారెడ్డి పేరును ఎర్రచందనానికి తగిలించారు. టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే ఆదివారం రాత్రి హడావిడిగా గురవారెడ్డిపై కేసు నమోదు చేశారు. అయితే సోమవారం ఉదయం పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎర్రచందనం కేసులో అసలైన ముద్దాయిలను పట్టుకోవడంతో గురవారెడ్డిని విడిచి పెట్టారు. అక్రమ కేసులు ఎంత వరకు కొనసాగవని నిరూపితమైంది.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో కొండమల్లీశ్వర స్వామివారు

వెదురుకుప్పం: డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు కొండమల్లీశునికి పాలు, పెరుగు, పసుపు, కుంకుమతో పాటు సుగంధ జలాలతో అభిషేకం చేశారు. తదుపరి స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయులురెడ్డి

కార్వేటినగరం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, స్వచ్ఛంద సేవా సంస్థ రాస్ ఐఆర్‌సీఏ సహకారంతో పొగాకు, గుట్కా, మత్తు పదార్థాల నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పొగాకు వాడకం ప్రాణానికి హానికరమన్నారు. ఇది సరదాగా మొదలైన అలవాటు వ్యసనంగా మారి ప్రాణాలనే బలితీసుకుంటుందన్నారు. మన దేశంలో ఏటా సుమారు 13.5 లక్షల మంది పొగాకు వాడకంతో మరణిస్తున్నారని పేర్కొన్నారు. పొగాకు ఉత్పత్తులతో ప్రజారోగ్యానికి, సమాజానికి, పర్యావరణానికి హాని కలుగుతుందని తెలిపారు. పొగాకు ఉత్పత్తుల నిషేధంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రాణాలు హరించే మత్తుకు విద్యార్థులు దూరంగా ఉండాలని, గ్రామాల్లో మత్తుతో కలిగే అనర్థాలను వివరించి వాటిని పూర్తి స్థాయిలో నిషేధించేందుకు కృషి చేయాలన్నారు. రాస్ అధికారులు దామోదరం, కళాశాల అధ్యాపకులు హరిబాబు, సుబ్బారావు, సీఎస్ లత పాల్గొన్నారు.

ప్రజల వినతులపై దృష్టి పెట్టండి

శ్రీరంగరాజపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని మండల తహసీల్దార్ అమర్‌నాథ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి 11 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్ 7, ఇంటి నిర్మాణానికి పొజిషన్ పట్టా మంజూరు చేయాలని 2, ఇతరుల ఆక్రమణలో భూమిని తొలగించి హద్దులను చూపించాలని 2 వచ్చాయన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరు జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యం

పుత్తూరు: మినీ గోకులాలు పథకం ద్వారా పాడి పరిశ్రమను అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. సోమవారం వడమాలపేట మండలం టీసీ అగ్రహారం గ్రామంలో గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం, లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మినీ గోకులం పథకం ద్వారా రాయితీలతో పశువుల షెడ్లను నిర్మించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బలిష్టంగా ఉన్న మూడు దూడలను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు గుర్తించారు. దూడ యజమానులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాడి రైతులు, పశుసంవర్ధక శాఖ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే తొలి టీకా

పుత్తూరు: బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే తల్లి ముర్రుపాలు తొలి టీకా వంటిదని సీడీపీఓ కె.పద్మజ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పుత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సోమవారం గర్భిణీలు, బాలింతల ఇంటింటికి వెళ్లి తల్లిపాలపై అవగాహన కల్పించారు. గోపాలకృష్ణాపురం, రామకృష్ణాపురం, గేట్‌పుత్తూరు, రజక కాలనీల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ తల్లిపాలు తాగించడం ద్వారా బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఏడోనెల నుంచి తల్లిపాలతో పాటు పోషకాహారం అలవాటు చేయాలని సూచించారు. ఇళ్లలోని పెద్దవారు గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరించడం ద్వారా తమ బాధ్యతలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘ సభ్యులు, గ్రామ సంఘాల ప్రతినిధులు, వెలుగు కోఆర్డినేటర్లు, సంఘమిత్రాలు, అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అమృతం కన్నా అమ్మపాలు మిన్న



పుత్తూరు: తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న సీడీపీఓ పద్మజ

పాలసముద్రం: శిశువు శారీరక ఎదుగుదలకు అవసరమైన పోషకాలకు, వారి సంపూర్ణ ఆరోగ్యానికి తల్లి పాలు అమృతతుల్యమని ఐసీడీఎస్ సూపరవైజర్ కె అనురాధ తెలిపారు. సోమవారం పాలసముద్రం దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో పీహెచ్‌సీ సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్ సమక్షంలో తల్లిపాలపై గర్భిణీలకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనురాధ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి విధిగా ముర్రుపాలు పట్టించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సరుకులను గర్భిణీలు, బాలింతలు సక్రమంగా తీసుకుని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి, సుశీల, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా



మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ మునిచంద్ర

పెనుమూరు(కార్వేటినగరం): వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఈఈ మునిచంద్ర అన్నారు. సోమవారం పెనుమూరు విద్యుత్ కార్యలయం వద్ద సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు విద్యుత్ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. రైతులు ఎలాంటి విద్యుత్ సమస్యలు ఇచ్చిన వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. విద్యుత్ బకాయిలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు వసూలు చేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఈ పి.తులసి ప్రసాద్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

సామాజిక సేవే సాయి సేవ



మొక్కలు నాటుతున్న సాయి భక్తులు

నగరి: సామాజిక సేవే సాయి సేవ అని శ్రీసత్య సాయి సేవా ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన అన్నారు. సోమవారం మండలంలోని తడుకుపేట శ్రీసాయి శివాలయంలో గోపూజ, అష్టోత్తర పూజలు, భజన నిర్వహించి, మహా మంగళహారతి అనంతరం పలువురు భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. అనంతరం భజన మండలి ఆవరణలో మొక్కలు నాటారు. సత్యసాయి భజన మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంతో కలిగే లాభాలను వివరించారు.

వాహనాల తనిఖీ

గంగాధర నెల్లూరు: చిత్తూరు జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం సీఐ లక్ష్మన్న ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మన్న మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపినా, మైనర్ బాలురు వాహనాలను నడిపినా, రికార్డులు లేకుండా నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. హెల్మెట్ లేని ప్రయాణం చాలా ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు గోపాల్, ఢిల్లీబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ లక్ష్మన్న

గృహ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

పాలసముద్రం: గృహనిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ దాము, పంచాయతీ కార్యదర్శి ధరణి ప్రసాద్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ రామనాథరెడ్డి ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది పాలసముద్రం దళితవాడలో పర్యటించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్లను పూర్తి చేయాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇండ్లు మంజూరై ఇంకా పనులు ప్రారంభించని వారు 100 రోజుల్లో పనులు పూర్తి చేస్తే బిల్లు వస్తుందని తెలిపారు. ఆపై ఇండ్లు నిర్మాణం చేసుకున్నా బిల్లులు రావని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీర్ అసిస్టెంట్ అక్షయ్ కుమార్, విలేజ్ సర్వేయర్ ఆలీ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ బాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ చంచయ్య పాల్గొన్నారు.

నిరుపయోగంగా దోమల నివారణ యంత్రం



ఎంపీడీవో కార్యాలయంలో నిరుపయోగంగా పడి ఉన్న దోమల నివారణ యంత్రం

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో దోమల నివారణ కోసం కొనుగోలు చేసిన యంత్రం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిరుపయోగంగా పడి ఉంది. కరోనా సమయంలో భారీ ఎత్తున నిధులు వెచ్చించి దోమల నివారణ కొనుగోలు చేశారు. ఇది పాడైపోయింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరి కొద్ది రోజులకు ఈ మిషనరీ ఎందుకు ఉపయోగపడని స్థితిలో ఏర్పడుతుంది.

ఎస్‌ఎంసీ ఎన్నికల సందడి





పాలసముద్రం హైస్కూల్లో నోటీస్ బోర్డులో ఓటర్ల జాబితా అంటిస్తున్న హెచ్‌ఎం, శ్రీకావేరిరాజుపురం ప్రాథమికోన్నత పాఠశాల

ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ)ల ఎన్నికలకు ఆగస్టు ఒకటో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాఠశాలల్లో సందడి మొదలైంది. నోటిఫికేషన్ కాపీలను, ఓటర్ల జాబితా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నోటీసు బోర్డుల్లో అంటించారు. చాలా వరకు పాఠశాలల్లో టీడీపీ నాయకులు పోటీ పడనున్నారు. కొన్ని పాఠశాలల్లో స్థానిక టీడీపీ నాయకులనే ఏకగ్రీవం చేసేందుకు రంగం సిద్ధమవుతోంది.

- నియోజకవర్గంలోని 442 పాఠశాలల్లో ఎన్నికలు

పాలసముద్రం: ఎస్‌ఎంసీ ఎన్నికల్లో భాగంగా 1వ తేదీ నోటిఫికేషన్ విడుదలతోపాటు మధ్యాహ్నం ఓటర్ల జాబితా ప్రకటించారు. 5వ తేదీ ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల్లోపు తుది జాబితా సిద్ధం చేసి ప్రకటించేశారు. ఆగస్టు 8వ తేదీన ఉదయం 7 నుంచి ఒంటి గంటల వరకు ప్రత్యక్ష పద్ధతిలో చేతులు ఎత్తడం ద్వారా ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికైన సభ్యులు ఎస్‌ఎంసీ చైర్మన్‌ను, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రమాణ స్వీకారం నిర్వహించాలి. సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల మధ్యలో కొత్త కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది.

442 పాఠశాలలు

జీడీ నెల్లూరు నియోజకవర్గంలో దాదాపు 442 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికైన సభ్యులతోపాటు ప్రధానోపాధ్యాయుడు లేదా ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. సంబంధిత గ్రామ పంచాయతీ సర్పంచ్, మున్సిపల్ చైర్‌పర్సన్, మేయర్ వారి ప్రాంతంలో ఎప్పుడైనా ఎస్‌ఎంసీ సమావేశాలకు వారి ఇష్టానుసారం హాజరు కావచ్చు.

ఎన్నికల విధానం

- పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్నికల నిర్వహణకు తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించాలి. కనీసం 50 శాతం మంది తల్లిదండ్రుల హాజరు తప్పనిసరి.
- తల్లిదండ్రులు లేదా సంరక్షకులు తమ పిల్లలు ఎన్ని తరగతుల్లో ఉంటే అన్ని తరగతుల్లో ఎన్నిక విధానంలో పాల్గొనవచ్చు, కానీ సభ్యులను ఎన్నుకొనేందుకు ఓటు వేసే అవకాశం ఒక్కరికే ఉంటుంది.
- సాధారణంగా చేతులు ఎత్తే ప్రక్రియ లేదా చెప్పడం ద్వారా ఎన్నిక నిర్వహించాలి. అసాధారణ పరిస్థితుల్లో బ్యాలట్ పద్ధతి ద్వారా ఎన్నిక నిర్వహించాలి.

మార్గదర్శకాలు

- పాఠశాల యాజమాన్య కమిటీలు ప్రాథమిక పాఠశాలల్లో మండల విద్యాశాఖాధికారులు, ఇతర పాఠశాలల్లో జిల్లా విద్యాశాఖాధికారి అధికారికంగా రద్దు చేసినట్లు ప్రకటించే వరకు నిరంతరం కొనసాగిస్తారు.
- ఎన్నికైన సభ్యుడి పదవీ కాలం రెండు సంవత్సరాలు
- ఒక వేళ సభ్యుడి కుమారుడు లేదా కుమార్తె ఆ పాఠశాల నుంచి వెళ్లిపోతే ఆ సభ్యుడి పదవీకాలం అంతటితో ముగుస్తుంది. ఆ స్థానం భర్తీ చేసేందుకు ఇతర విద్యార్థుల తల్లిదండ్రులను సభ్యులుగా ఎన్నుకుంటారు.

నిబంధనల ప్రకారం ఎన్నికలు



ఎస్‌ఎంసీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేశాం. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో నోటిఫికేషన్‌ను ప్రదర్శిస్తున్నాం. ఎన్నికల షెడ్యూల్, ఎన్నిక ప్రక్రియ విధానం వివరాలను ప్రకటించాం. 8న తేదీన ఎన్నికలు జగిరే రోజు అవసరమైన చోట పోలీస్ బందోబస్తు కోరుతాం. తల్లిదండ్రుల సహకారంతో నిబంధనల ప్రకారం ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తాం.

– రాజేంద్రప్రసాద్, ఎంఈఓ, పాలసముద్రం